కనీస సౌకర్యాలు కరువు

- 400 విద్యార్థినులకు నాలుగు మరుగుదొడ్లే
- ఆశ్రమ పాఠశాలలో తప్పని తిప్పలు



పాఠశాల వెనుక భాగంలో తక్కువ ఎత్తులో ఉన్న ప్రహరీ



మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల

లింగాల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని పాలకుల చెప్తున్నా మాటలకు క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరుకు పొంతన లేకుండా ఉంది. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థినులు అల్లాడుతున్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక నానా అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో మొత్తం 400 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి కేవలం నాలుగు మరుగుదొడ్లు, నాలుగు స్నానపు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరుగుదొడ్డికి వెళ్లేందుకు క్యూ నిల్చునే దుస్థితి నెలకొంది. అదేవిధంగా ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో పోకిరీల బెడద కూడా ఉందని విద్యార్థినులు వాపోయారు. దీంతో విద్యార్థినులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలికల ఇబ్బందులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేనాథుడే కరువయ్యారు.



నిరుపయోగంగా ఉన్న మరుగు దొడ్లు, స్నానపు గదులు

నిరుపయోగంగా నూతన మరుగు దొడ్లు..

విద్యార్థినుల సంఖ్యకు సరిపడు మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించి నెలలు గడుస్తున్నా అసంపూర్తి పనులతో వినియోగంలోకి రాలేదు. నీటి సరఫరా, సెప్టిక్ ట్యాంక్‌కు ఎయిర్ పైపు ఏర్పాటు చేయక పోవడంతో ఉపయోగం లేకుండా పోయాయి.

సమస్యలు పరిష్కరిస్తాం..

ఆశ్రమ పాఠశాలలో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదులు వాడుకలో లేవు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకవెళ్లాం. సమస్యలు పరిష్కరించి, విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– మాసమ్మ, హెచ్‌ఎం

క్లుప్తంగా

పథకాలపై దివ్యాంగులకు అవగాహన

మన్ననూర్: ప్రభుత్వం దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ పర్రె ప్రసాద్ అన్నారు. ఆదివారం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, కల్ములోనిపల్లి, తెలుగుపల్లి గ్రామాలలోని దివ్యాంగులతో ఆయన సమావేశం అయ్యారు. ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన వారికి బ్యాటరీ ట్రై సైకిల్, స్కూటీలు, కృత్రిమ అవయవాలు అందజేసిందన్నారు. పలు పథకాలను ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో దివ్యాంగుల గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కందనూలు: త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని పలు కాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. నాగర్ కర్నూలు, అచ్చంపేట కమిటీల అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు శంకర్ శ్రేష్ఠి, పర్వతాలు, వెంకటన్న, నిరంజన్, చంద్రకళ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న చైతన్య స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సయ్యద్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని చైతన్య స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తూ తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఎన్నిక



ఊర్కొండ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వెంకటయ్యగౌడ్‌ను ఎంపికచేశారు. ఈమేరకు ఆయన నియామకపత్రం అందజేశారు. మండల కేంద్రంలో వెంకటయ్యగౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చిక్కుడు వంశీకృష్ణ, డాక్టర్ మల్లు రవి, కుడుముల తిరుపతి రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి

తాడూరు: నియోజకవర్గంలో అర్హులైన దళితులందరికి దళితబంధు ఇవ్వాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, బంగారయ్య, రామాంజనేయులు, వెంకటయ్యలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని తోటపల్లిలో పోశయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సర్పంచ్ శ్రీలతరాజేష్ సమకూర్చిన రూ.5 వేలు కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

కొల్లాపూర్ రూరల్: ఎమ్మెల్యే బాల్‌రాజు, అతని అనుచరులపై కేసు నమోదు చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ముక్కిడిగుండంలో ఆయన గిరిజన నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గ లక్ష్మాపూర్‌లో గిరిజన మహాశక్తి రాష్ట్ర అధ్యక్షుడు చందర్ నాయక్‌పై అకారణంగా దాడి చేయడం సరికాదన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



కల్వకుర్తిరూరల్: పాఠశాల భవన నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని గుండూరులో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పాఠశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూడాలని కోరారు.

పిచ్చి మొక్కల తొలగింపు



ఉప్పునుంతల మండలం గువ్వలోనిపల్లిలో హాజరైన డీఆర్‌డీఓ నర్సింగరావు, అధికారులు



వట్టెం నవోదయ విద్యాలయంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో శ్రమదానం, స్వచ్ఛభారత్ నిర్వహించారు వీధులను శుభ్రం చేశారు. ఆస్పత్రి ఆవరణ, బస్టాండ్, గ్రామ ప్రధాన కూడళ్లలో పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను ఊడ్చారు. ఏక్ గంటా, ఏక్ దిన్, ఏక్ సాత్ స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా వట్టెం జవహార్ నవోదయ విద్యాలయ విద్యార్థులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఉప్పునుంతలలో డీఆర్‌డీఓ నర్సింగరావు, జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్ పర్సన్ కల్పన, మండల కేంద్రాల్లో ఎంపీడీఓ, ఎంపీఓలు, సర్పంచ్‌లు, నాయకులు హాజరయ్యారు.

అచ్చంపేట పట్టణంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుతో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహ్మాగౌడ్ శ్రమదానం చేశారు.

మంత్రి హరీశ్‌రావు సభకు తరలిన జనం



వెల్దండ నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలో నిర్వహించిన మంత్రి హరీశ్‌రావు సభకు ఆదివారం కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు.

వెల్దండ: మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు చెందిన పార్టీ కార్యకర్తలు వివిధ వాహనాలలో బయలుదేరారు. భూపతిరెడ్డి, జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, శేఖర్‌ముదిరాజ్, భీమయ్యగౌడు, భాస్కర్‌రావు, సర్పంచులు, పార్టీ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

హ్యాట్రిక్ విజయం ఖాయం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

ఉప్పునుంతల: వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో సీసీ రోడ్ల కోసం త్వరలోనే రూ. 1.22 కోట్లు నిధులు మంజూరు చేస్తానన్నారు. 30 పడకల ఆస్పత్రిని వారం రోజుల్లో ప్రారంభించి వినియోగంలోకి తెస్తామన్నారు. అనంతరం గ్రామంలో దేవాలయాలు, కమ్యూనిటీ భవనల అభివృద్ధి కోసం మంజూరైన నిధులకు సంబంధించిన ప్రొసిడింగ్‌లను ఆయా కుల సంఘం నాయకులకు అందజేశారు. మండలంలోని గట్టుకాడిపల్లికి చెందిన కాంగ్రెస్, పలు పార్టీలకు చెందిన కొంతమంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ కట్టా గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, మేడమోని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొల్లాపూర్: పట్టణంలోని 17వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మరణించిన రెడ్డి లక్ష్మి కుటుంబాన్ని, 7 వ వార్డులో మరణించిన దిడ్యాల బొజమ్మ కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట రంగినేని అభిలాష్‌రావు, కౌన్సిలర్ కృష్ణమూర్తి, డాక్టర్ రాముడుయాదవ్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

వృద్ధుల హక్కులను కాపాడుదాం



కల్వకుర్తిలో వృద్ధులను సన్మానిస్తున్న ఆర్డీఓ శ్రీను

కల్వకుర్తి టౌన్: వృద్ధుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్డీఓ శ్రీను అన్నారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వృద్ధాప్యంలో పిల్లలు ఆస్తుల కోసం తల్లిదండ్రులను విస్మరించొద్దని సూచించారు. అనంతరం వృద్ధులు, రిటైర్డు ఉపాధ్యాయులను, ఆయన సన్మానించారు. అనంతరం పట్టణంలోని ప్రజల భాగస్వామ్య సంస్థలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఎన్జీఓ నిర్వాహకుడు వెంకటయ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వెంకటమ్మ, తహసీల్దార్ రాజేందర్, ఎంపీపీ మనోహర పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో పట్టణానికి చెందిన పలువురు వృద్ధులను ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. వారికి మిఠాయిలు అందజేశారు. న్యాయవాది. మధుసూధన్‌రావు, జమీల్‌అహ్మద్‌ఖాన్, వెంకటస్వామి, శ్రీధర్, అన్వర్, బాలపీర్, జావీద్‌ఖాన్ తదితరులున్నారు.



అచ్చంపేటలో..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎస్‌పీవీ గుప్తా అనాథ వృద్ధాశ్రమంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలేంద్రకుమార్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, సీడీపీఓ దమయంతి, ఏసీడీపీఓ కమల, సీనియర్ సిటిజన్స్, పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు మెరుగు

కందనూలు: నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ కోఆర్డినేటర్ నాగేశ్వరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌లో ఆన్‌లైన్‌లో నమోదు అయి ఉన్నా కార్మికుల పిల్లలకు ఉచిత కెరీర్ గైడె, రెజ్యూమ్ ప్రిపరేషన్ వర్క్ షాప్ నిర్వహించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యం తప్పనిసరి అన్నారు. అనంతరం ప్రాజెక్టు లీడ్స్ ఎండీ సాధిక్, జి సూరిబాబుల ఆధ్వర్యంలో 130 మందికి శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు.

మంత్రి హరీశ్‌రావుకు వినతి

వెల్దండ: కల్వకుర్తిలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వెళ్తున్న మంత్రి హరీశ్‌రావుకు మార్గమధ్యలో మండల కేంద్రంలో కుప్పగండ్ల రెవెన్యూ శివారులోని ఓఆర్‌సీ భూములకు పట్టాలని అందించాలని ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, సర్పంచ్ శ్రీనువాస్‌నాయకులు, రైతులు వినతిపత్రం అందించారు. రెవెన్యూ శివారులో దాదాపుగా 1800ఎకరాల భూములకు పట్టాలు లేక 200మంది రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు

కొల్లాపూర్: ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా సీపీఎం, కాంగ్రెస్ పార్టీలతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులను పట్టణ పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఆదివారం ఉదయం ఆయా పార్టీల నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తెలకపల్లి: ప్రధాని నరేంద్రమోదీ సభ పురస్కరించుకొని బీఎస్పీ నాయకులు శివశంకర్, మల్లయ్య, లక్ష్మణ్ తదితరులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుస్టేషన్‌లో బీఎస్పీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజాసంఘాల నాయకులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. కల్వకుర్తిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కోసం వస్తున్న మంత్రి హరీశ్‌రావు పర్యటనను అడ్డుకుంటారని సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చారకొండ: మంత్రి హరీశ్‌రావు పర్యటనను దృష్టిలో ఉంచుకొని ఆశవర్కర్లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో చలో హైదరాబాద్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల సంఘం సభ్యుడు హైదరాబాద్‌లో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే వైశ్య గర్జనకు మండల నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా మండల నాయకులు రఘు మాట్లాడుతూ ఆర్య వైశ్య కార్పొరేషన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రఘు, శివ, రాజు, రాకేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు గర్జన'కు తరలిన బీజేపీ శ్రేణులు



సాక్షి, నెట్‌వర్క్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలో ఆదివారం నిర్వహించిన పాలమూరు ప్రజా గర్జన సభకు బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలలో బయలుదేరారు. కొల్లాపూర్ నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు నేతృత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సభకు అధికసంఖ్యలో వెళ్లారు.

అగ్నిపథ్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన మేడమోని మహేష్ అగ్నిపథ్ ఆర్మీకి ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆదివారం కాలనీకి చెందిన యువకులు మహేష్‌ను సన్మానించారు. యువకులు శేఖర్‌గౌడ్, మల్లయ్య, భాస్కర్, సురేష్, పోశాలు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు ఛాయాచిత్ర సేవా పురస్కార్ అవార్డు



అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతం పట్టణానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్లు చంద్రమౌళి, బీమాచారి ఛాయాచిత్ర సేవా పురస్కార్ అవార్డును అందుకున్నారు. గత నెల 27, 28, 29 తేదీలలో గోవాలో నేను సైతం ఛాయాచిత్ర ఫౌండేషన్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల నుంచి ఫొటోగ్రాఫర్లు పాల్గొనగా పట్టణానికి చెందిన ఇద్దరు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో నేను సైతం ఛాయా చిత్ర ఫౌండేషన్ ఛారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ కమ్మరి రామకృష్ణ చారి, ప్రొఫెసర్ ఏఆర్ కమల్‌రాయ్, మారుతి, భానుప్రకాష్, సిద్ధార్థ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి



అల్లాపూర్ ఆలయంలో పూజలు చేస్తున్న మల్లురవి, రాజేష్‌రెడ్డి



మాచినేనిపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తున్న జూపల్లి కృష్ణారావు

తాడూరు: కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ మల్లురవి, రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొల్కూరు, గుట్టపల్లి, అల్లాపూర్‌లో పార్టీ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలను తప్పనిసరి అమలు చేస్తామని ఇంటింటా ప్రజలకు హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం..

కొల్లాపూర్ రూరల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని మాచినేనిపల్లిలో ఏఐసీసీ అసెంబ్లీ పరిశీలకులు వాసుదేవ్ మూర్తి, రాజు జమాఖండికర్‌తో కలిసి ఆయన కాంగ్రెస్ జెండా ఎగరవేశారు.

వెల్దండ: రాష్ట్రంలో పేద సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నూతన పథకాలను తీసుకువచ్చిందని మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చెదురుపల్లిలో గడప, గడపకు కాంగ్రెస్–ఇంటింటా సంక్షేమం నినాదంతో ప్రచారం నిర్వహించారు.

కల్వకుర్తి టౌన్: గాంధీజయంతిని పురస్కరించుకుని పట్టణంలో 'సత్యయేవ జయతే' పేరుతో పాదయాత్రను నిర్వహిస్తున్నట్లుగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు తెల్లచొక్కాలు ధరించి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి పాత మున్సిపాలిటీలోని గాంధీ విగ్రహం వరకు పాతయాత్ర చేస్తామని పేర్కొన్నారు.

మభ్యపెట్టడానికే ఎమ్మెల్యే హామీలు..

ఉప్పునుంతల: అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రజలను మభ్యపెట్టడానికే హామీలు ఇవ్వడంతోపాటు నిధులు మంజూరైనట్లు ప్రొసీడింగ్‌లు ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సారా స్వాధీనం

అచ్చంపేట రూరల్: మండలంలోని గుంపన్‌పల్లి మార్గంలో ఆదివారం రూట్ వాచ్ నిర్వహిస్తున్న సమయంలో నాటుసారా లభ్యమైనట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణా తెలిపారు. నక్కరిపెంట నుంచి మధ్య అనే వ్యక్తి టీవీఎస్ వాహనంపై 7.5 లీటర్ల సాటుసారా తరలిస్తుండగా పట్టుబడినట్లు సీఐ పేర్కొన్నారు. వాహనం స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు బాలరాజు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మసీద్ నిర్మాణానికి నిధులు మంజూరు

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటలో మసీద్ అభివృద్ధికి ఉమ్మడి మహబూబ్‌నగర్ శాసన మండలి సభ్యుడు కసిరెడ్డి నారాయణ రెడ్డి రూ.3 లక్షల నిధులను మంజూరు చేశారు. ఆదివారం గ్రామానికి చెందిన కొందరు నాయకులకు ఎమ్మెల్సీ ప్రొసిడింగ్స్‌ను అందజేశారు. సర్పంచ్ రేణుకబాలస్వామి, నాగరాజు, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

మన్ననూర్: స్థానిక గిరిజన ఉన్నత పాఠశాలలో 1987–88వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 32 ఏళ్ల కిందట పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో మహేందర్‌గౌడ్, వెంకటేష్, బాల్‌రాజ్, శంకర్, జయానంద్, అసాదుల్లా, రామస్వామి, ఖలీముల్లా, నిరంజన్, హాజీబాబా, చందులాల్, అరవింద్, గీతారాణి, రేవతి, ఖలీల్, మాద్య, సురేందర్, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

దోమలపెంట: మండలంలోని శ్రీశైలం ప్రాజెక్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1998–99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఆనాటి హెచ్‌ఎం జయంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు అల్లెన్న, మురళీకృష్ణ, వెంకన్న, సలీం, రాజశేఖర్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. రాజస్థాన్, పూణె, చెన్నై, బెంగుళూరు, రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, ఎడ్ల శేఖర్, రాఘవేందర్‌రెడ్డి, ఓంకార్, ఖలీల్, రమేష్, సత్య పాల్గొన్నారు.



మన్ననూర్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



దోమలపెంటలో ..